సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 7 । మార్చి । 2023



ప్రభుత్వ మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జగనన్న ప్రభుత్వం మూడున్నరేళ్లలో చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందామని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. - 8లో



రథోత్సవం.. రమణీయం

గుర్రంకొండ మండలంలోని తరిగొండ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. వేలాది భక్తులు హాజరయ్యారు. - 8లో

గరిష్టం/కనిష్టం
35.7 /17.0

వాతావరణం

జిల్లాలో సోమవారం 17.0 - 35.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే స్పందన



అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సిటీ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని డీఆర్వో గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనంద్‌నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు అన్‌ఎయిడెడ్ స్కూల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లకు సంబంధించి 1వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు ఈ నెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రవేశానికి అర్హత పొందే విద్యార్థుల ఎంపిక ఏప్రిల్ 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన మొదటి ఎంపిక జాబితాను ఏప్రిల 13వ తేదీ విడుదల చేస్తామని తెలిపారు.

ఎన్‌సీఏకు ఎంపిక



ప్రణవ్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరానికి చెందిన బి. ప్రణవ్ రెడ్డికి క్రికెట్‌లో చక్కటి అవకాశం లభించింది. అండర్–16 జూనియర్ విభాగంలో రైట్‌ఆర్మ్ మీడియం పేస్‌బౌలర్‌గా చక్కటి ప్రతిభ కనబరచడంతో ఏప్రిల్ 17 నుంచి మే 11వ తేదీ వరకు బెంగుళూరులోని ఎన్‌సీఏ(నేషనల్ క్రికెట్ అకాడమీ)లో నిర్వహించే ఇండియన్ జూనియర్ క్రికెట్ క్యాంపునకు ఎంపిక చేశారు. జిల్లాకు చెందిన క్రీడాకారుడు నేషనల్ క్రికెట్ క్యాంపునకు ఎంపికవడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్.ఖాజామైనుద్దీన్, ప్రాంతీయ కన్వీనర్ పి.సంజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పీఏఆర్ఎస్ ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షుడిగా డాక్టర్ అచ్చన్న



కడప అగ్రికల్చర్ : పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి(పీఏఆర్ఎస్) అనుబంధ ఉద్యోగుల విభాగం కడప పార్లమెంటరీ అధ్యక్షుడిగా తనను నియమించినట్లు కడప బహుళార్థ పశువైద్యశాల(వీపీసీ) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చన్న తెలిపారు. సోమవారం వీపీసీలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ పీఏఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరమశివన్ ఈ మేరకు నియామక ఉత్తర్వులను పంపారని తెలిపారు. సమసమాజ నిర్మాతలు మహాత్మ జ్యోతిరావుపూలే, బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

- వైఎస్ఆర్ జిల్లాలో పన్ను ఎగవేతదారులపై రవాణా శాఖ నిఘా
- పన్ను చెల్లించని 9259 వాహనాలను గుర్తించిన అధికారులు
- వాహన యజమానులకు ఫోన్‌ల ద్వారా మెసేజ్‌లు, నోటీసులు
- ఆ వాహనాలను పట్టుకునేందుకు తొమ్మిది బృందాల ఏర్పాటు
- రోడ్డుపై పట్టుబడితే చెల్లించాల్సిన దానికంటే 200 శాతం రెట్టింపు పన్ను వసూలు



తప్పించుకున్నా..
తప్పదు మూల్యం!

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో వేలాది మంది రవాణాశాఖకు చెల్లించాల్సిన పన్నులను జమ చేయకుండా తమ వాహనాలతో రోడ్లపై దర్జాగా తిరుగుతున్నారు. అలాంటి వాహనాలను పట్టుకొని బాధ్యుల నుంచి పన్నులు వసూలు చేసేందుకు రవాణాశాఖ నడుం బిగించింది. పన్ను బకాయిలు ఉన్న వాహనాలను గుర్తించేందుకు జాబితాను సిద్ధం చేసింది. వాటిని సీజ్ చేయడంతో పాటు భారీగా జరిమానా విధించేందుకు ఉపక్రమించింది. వాహనదారులకు ఆఖరి అవకాశంగా వారి ఫోన్‌లకు మెసేజ్‌లతో పాటు నోటీసులు జారీ చేస్తోంది. కాలం తీరి స్క్రాప్‌గా మారిన వాహనాలు ఉంటే వాటి వివరాలను లిఖిత పూర్వకంగా రవాణాశాఖకు అందజేయాలని ఆదేశాలు ఇచ్చింది.

జిల్లాలో వేల వాహనాల గుర్తింపు

రవాణాశాఖకు పన్ను చెల్లించకుంటే ఏమవుతుందిలే అనే ధీమాతో వేలాదిమంది వాహనదారులు జిల్లాలో రోడ్లపై దర్జాగా తిరుగుతున్నారు. వాస్తవానికి వాహనాన్ని, దాని విలువను బట్టి ప్రతి మూడు, ఆరు, 12 మాసాలకు ఒకసారి యజమానులు రవాణాశాఖకు పన్ను చెల్లించాల్సి ఉంది. అయితే వేలమంది పన్ను చెల్లించడం లేదు. ఇలా పన్నులు చెల్లించని వారి సంఖ్య ప్రతి త్రైమాసికానికి పెరిగిపోతోంది. ఇలా జిల్లా వ్యాప్తంగా గత ఏడాదిలో పన్ను చెల్లించని వాహనాల సంఖ్య 9259 గా అధికారులు లెక్క తేల్చారు. త్రైమాసిక పన్నులు ఎగ్గొట్టి రోడ్లపై చక్కర్లు కొడుతున్న వాహన యజమానులకు సెల్‌ఫోన్‌ల ద్వారా వారు కట్టాల్సిన పన్ను వివరాలను తెలియజేస్తూ మెసేజ్‌లు పంపుతున్నారు. ఈ మెసేజ్‌లకు స్పందించని యజమానులకు తప్పని పరిస్థితుల్లో నోటీసులు సైతం జారీ చేస్తున్నారు. మెసేజ్‌లు, నోటీసులకు స్పందించిన 1062 వాహనాల యజమానులు త్రైమాసిక పన్నులను రూ. 86 లక్షలు చెల్లించారు. పన్ను చెల్లించని వాహనాల రిజిస్ట్రేషన్లను రద్దు చేసి వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రవాణా అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏదైనా ప్రమాదంలో స్క్రాప్‌గా మారిన వాహనాలు ఉంటే ఆ వివరాలను కాగితాల రూపంలో సంబంధిత యజమానులు తమకు అందజేయాలని రవాణాశాఖ అధికారులు కోరుతున్నారు.

తొమ్మిది ప్రత్యేక బృందాల ఏర్పాటు

రవాణాశాఖకు పన్ను ఎగవేసి దర్జాగా తిరుగుతున్న వాహనాలను గుర్తించేందుకు జిల్లాలో తొమ్మిది ప్రత్యేక బృందాలు రహదారులపై జల్లెడ పడుతున్నాయి. జిల్లాలో 36 మండలాల్లో రోడ్లపై ఎక్కడ కనిపించినా అధికారులు సీజ్ చేసేస్తున్నారు. యజమానులు స్వచ్ఛందంగా వస్తే త్రైమాసికాన్ని బట్టి పన్నులు వసూలు చేస్తున్నారు. త్రైమాసికం మొదటి నెలలో పన్ను చెల్లిస్తే 25 శాతం పెనాల్టీతో సరిపెడుతున్నారు. త్రైమాసికం ఆఖరి నెలలో వస్తే 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో రోడ్డుపై పట్టుబడితే ఏకంగా 200 శాతం జరిమానా విధించి వసూలు చేస్తున్నారు.

సకాలంలో పన్ను చెల్లించాలి



వాహనదారులు సకాలంలో పన్నులు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలి. పన్ను వసూలు విషయంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలు ఇస్తోంది. రవాణాశాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలు జిల్లా వ్యాప్తంగా తిరుగుతున్నాయి. ప్రతి త్రైమాసికానికి పన్ను చెల్లిస్తే యజమానులకు కష్టం అనిపించదు. పన్ను చెల్లించాల్సిన వాహన యజమానులకు ఫోన్‌ల ద్వారా మెసేజ్‌లు పంపుతున్నాం. స్పందించని వారికి నోటీసులు జారీ చేస్తున్నాం.
– ఇ. మీరా ప్రసాద్, వైఎస్ఆర్ జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్

వందశాతం ఉత్తీర్ణతకు కృషి

- ఈనెల 10న హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం
- విలేకరుల సమావేశంలో డీఈఓ చెప్పలి దేవరాజు



మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

కడప ఎడ్యుకేషన్ : ఈ ఏడాది నిర్వహించే పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నామని డీఈఓ చెప్పలి దేవరాజు పేర్కొన్నారు. పది పరీక్షల నిర్వహణ, సన్నద్ధతపై సోమవారం డీఈఓ కార్యాలయంలోని తమ చాంబర్‌లో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పది పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది జిల్లాలో 27,211 మంది విద్యార్థులు 146 కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారన్నారు. మార్చి 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రోజు మార్చి రోజు పరీక్ష ఉంటుందన్నారు. ఇప్పటికే పదవ తరగతికి సంబంధించిన కార్యాచరణ ప్రారంభమైందన్నారు. గతేడాది 50 శాతం ఫలితాలు వచ్చిన పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు కొంత మంది ఉపాధ్యాయులు వారిని దత్తత తీసుకుని ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ఈ నెల 10వ తేదీన హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఎంఈఓలు ప్రతి రోజు ఒక స్కూల్‌ను సందర్శించాలన్నారు. అలాగే ఎంఈఓ, హెచ్‌ఎంలు నైట్ విజిట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పది పరీక్షల సీనియర్ అసిస్టెంట్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు షబ్బేబరాత్

- 'ఇషా' నమాజ్ తర్వాత ఆధ్యాత్మిక కార్యక్రమాలు
- ఏర్పాట్లలో మసీదు నిర్వాహక కమిటీలు



కడపలోని అమీన్‌పీర్ దర్గా మసీదు

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ ఆగమనాన్ని తెలియజేస్తూ షబ్బే బరాత్ (బడీ రాత్) పర్వదినాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముస్లింలు రాత్రి ఇషా నమాజ్ తర్వాత తమ పాపాలు క్షమించబడే గొప్ప రాత్రిగా భావిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఈ సందర్భంగా అన్ని మసీదుల్లో మత గురువులు, ఆధ్యాత్మిక ప్రసంగీకుల ఆధ్వర్యంలో పవిత్ర రాత్రి విశిష్టత గురించి వివరించనున్నారు. దీంతో పాటు రానున్న పవిత్ర మాసం గొప్పతనాన్ని, అందుకు సంబంధించి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తారు. ఈ పవిత్ర రాత్రి నిర్వహణకు సంబంధించి మసీదు కమిటీల ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలైన నమాజ్, జికర్, పవిత్ర ఖురాన్ పఠనం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. శనివారం తెల్లవారుజామున ఫజర్ నమాజ్ తర్వాత తమ దివంగతుల పెద్దల సమాధుల వద్ద వెళ్లి పాపాలను క్షమించాలని దైవాన్ని కోరుతూ ప్రార్థనలు నిర్వహించనున్నారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక కంట్రోల్ రూమ్

తిరుపతి : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఈనెల 31 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం ఆయన ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈఓ మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీన శ్రీ కోదండరామస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు ప్రారంభించాలన్నారు. కల్యాణానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వైఎస్ఆర్ జిల్లా అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుని టీటీడీలోని అన్ని విభాగాల అధికారులు సమర్థవంతంగా పని చేయాలన్నారు. భక్తుల సంఖ్యకు సరిపడా తాగునీరు, మజ్జిగ పంపిణీకి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. స్వామివారి కల్యాణం అనంతరం ప్రతి భక్తుడికి అక్షింతలు, కంకణాలు, పసుపు కుంకుమ అందేలా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పుష్పాలు, విద్యుత్ అలంకరణలతో కల్యాణవేదికను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే వాహనసేవల ముందు, కల్యాణవేదికపై అద్భుతమైన కళాప్రదర్శనలు ఏర్పాటు చేయాలని హెచ్‌డీపీపీ అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల పోస్టర్లు, బుక్‌లెట్లు త్వరగా ముద్రించి విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. బ్రహ్మోత్సవాలు, ప్రత్యేకించి కల్యాణోత్సవం రోజున భక్తులకు చిన్నపాటి ఇబ్బంది కలిగినా తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించేలా కంట్రోల్ రూమ్ పని చేయాలన్నారు. డిప్యూటేషన్ సిబ్బందికి అన్నప్రసాదాలు, వసతి ఏర్పాట్లపై ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాలతోపాటు కల్యాణవేదిక ప్రాంగణంలో అవసరమైనన్ని ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని, గ్యాలరీల్లో కూర్చునే భక్తులకు ఎండవేడిమి నుంచి ఉపశమనం కల్పించేందుకు తగినన్ని కూలర్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో క్యూలు, అన్నప్రసాదాల పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు కోసం వైఎస్ఆర్ జిల్లా అధికారులతో కలిసి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల పార్కింగ్ కోసం తగినన్ని ప్రదేశాలు సిద్ధం చేయాలన్నారు. ప్రత్యేక వైద్య బృందాలు, ప్రథమ చికిత్స కేంద్రాలు, మందులు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఈ సమీక్షలో ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్ కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, సీఏఓ శేషశైలేంద్ర, ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, డీఎఫ్ఓ శ్రీనివాస్, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

మండలి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించండి



కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓలు, నోడల్ అధికారులు, సీఈఓ తదితరులు



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు డాక్టర్ పోలా భాస్కర్, హరిజవహర్‌లాల్

- ఎన్నికల పరిశీలకులు డాక్టర్ పోలా భాస్కర్, ఎం.హరిజవహర్‌లాల్
- ఈసీ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు
- కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : శాసనమండలి ఎన్నికలను ప్రశాంతంగా, పకడ్బందీగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఎన్నికల పరిశీలకులు డాక్టర్ పోలా భాస్కర్, ఎం.హరిజవహర్‌లాల్ నోడల్ అధికారులను ఆదేశించారు. శాసనమండలి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం కడప కలెక్టరేట్‌లోని స్పందన హాలులో వారు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలతో కలిసి సంబంధిత నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు విజయరామరాజు, పీఎస్ గిరీషాలతోపాటు ఎస్పీలు అన్బురాజన్, హర్షవర్ధన్‌రాజు, జేసీ సాయికాంత్‌వర్మ, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, కడప నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయిప్రవీణ్‌చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, అన్నమయ్య డీఎఫ్ఓ వినోద్‌లు హాజరయ్యారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు కావాలి

ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు కావాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే ప్రకటించిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ చెక్‌లిస్టు ఆధారంగా పోలింగ్‌కు రెండు రోజుల ముందే చేరుకుని ఏర్పాట్లను సరిచూసుకోవాలని తెలిపారు. పోలింగ్‌రోజున పోలీసు భద్రత, ప్రిసైడింగ్ అధికారి డైరీ నిర్వహణ, ప్రశాంత పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుతో ఓటుహక్కు వినియోగం, సూక్ష్మ పరిశీలకుల నివేదిక, వెబ్ కాస్టింగ్, వీడియో నిర్వహణ, పోలింగ్ ముగింపు తర్వాత బ్యాలెట్ బాక్సుల భద్రత, ఓట్ల లెక్కింపు వంటి అంశాలపై వారు సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి సమస్య లేకుండా ఎన్నికలు జరిగేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

ఈసీ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు పటిష్టం

ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లను పటిష్టం చేసినట్లు కలెక్టర్ విజయరామరాజు ఎన్నికల పరిశీలకులకు తెలిపారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తీసుకున్న ఏర్పాట్లపై వివరించారు. జిల్లాలో 131 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఎన్నికల నిర్వహణకు 191 మంది పీఓలు, 191 మంది ఏపీఓలు, 393 మంది ఓపీఓలను నియమించామన్నారు. జిల్లాలో 37 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అక్కడ అదనపు భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఆర్డీఓలు, జెడ్పీ సీఈఓలు, డీపీఓలు, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

ఈనెల 13వ తేదీన జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల పరిశీలకులు డాక్టర్ పోలా భాస్కర్, హరిజవహర్‌లాల్‌లు పరిశీలించారు. వైఎస్సార్ జిల్లాకు సంబంధించి 131 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే 881 మంది సిబ్బందికి, అన్నమయ్య జిల్లాలో 37 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే 252 మంది సిబ్బందికి, చిత్తూరు జిల్లాలో 44 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే 300 మంది సిబ్బందికి సంబంధించి రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా రూపొందించినట్లు జేసీ సాయికాంత్‌వర్మ ఎన్నికల పరిశీలకులకు వివరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాలులో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సాఫ్ట్‌వేర్ ద్వారా రెండవ దశ ర్యాండమైజేషన్ చేసిన ప్రక్రియను జేసీతో కలిసి ఎన్నికల పరిశీలకులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయిప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, రాజంపేట సబ్ కలెక్ట్ అర్మన్ అహ్మద్‌ఖాన్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, ఎన్ఐసీ డీఐఓ విజయ్‌కుమార్, సీపీఓ వెంకట్రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- దాహార్తితో అలమటిస్తున్న వన్యప్రాణులు
- అడవికి నిప్పుతో గ్రామాల వైపు పరుగులు
- నీటి వనరుల కల్పనపై అటవీ శాఖ దృష్టి

మూగ జీవుల గొంతెండుతోంది

రేంజ్‌లు ఇలా..

జిల్లా	: రేంజ్
వైఎస్సార్	: కడప, ఒంటిమిట్ట, సిద్దవటం, వేంపల్లె, ముద్దనూరు, ప్రొద్దుటూరు, వనిపెంట, పోరుమామిళ్ల, బద్వేలు
అన్నమయ్య	: రాజంపేట, చిట్వేలి, సానిపాయి, బాలపల్లె, రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లె, పీలేరు

రాజంపేట : వేసవి ముంచుకొస్తోంది. ముఖ్యంగా ఈ కాలంలో నీటి కోసం అడవి జంతువులు తీవ్ర ఇబ్బంది పడతాయి. ఈ నేపథ్యంలో అటవీ శాఖ ముందస్తుగానే కార్యాచరణ ప్రణాళికలో నిమగ్నమైంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో ఫిబ్రవరి నుంచే ఏర్పాట్లు చేస్తోంది.

మార్చి ప్రారంభం నుంచే ఎండలు

ఉమ్మడి జిల్లాల్లో శేషాచలం, లంకమల, పెనుశిల, నల్లమల అటవీ ప్రాంతాలు ఉన్నాయి. మార్చి నెల ప్రారంభం నుంచే ఎండలు మొదలయ్యాయి. అటవీ ప్రాంతంలో నీటి సమస్య ఉత్పన్నమైంది. పర్యవసానంగా వన్యప్రాణులు కొన్ని చోట్ల గ్రామాల వైపు వస్తున్నాయి.

అడవికి నిప్పుతో పల్లెల వైపు పరుగులు

మరోవైపు అడవికి నిప్పు రాజుకున్న క్రమంలో వన్యప్రాణులు గందరగోళ పరిస్థితుల్లో తమ ప్రాణాలు కాపాడుకునేందుకు అటవీ సమీప పల్లెల వైపు పరుగులు తీస్తున్నాయి. మరికొన్ని ఆహారం, నీటి కోసం కూడా వచ్చి ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి. ఇలాంటి సంఘటన గత గురువారం సిద్దవటం రేంజ్‌లో చోటుచేసుకుంది.

ఏ జంతువులు ఉన్నాయంటే..

అటవీ ప్రాంతంలో జింకలు, దుప్పిలు, కొండ గొర్రెలు, అడవి బర్రెలు, అడవిపందులు, నెమళ్లు, చిరుతలు, పెద్దపులి, హనిబాడ్జర్, మనుబోతు, కణుజు, రోషకుక్కలు, తోడేళ్లు, నక్కలు, ఎలుగుబంట్లతోపాటు ఇతర జంతువులు, పక్షులు నీటి కోసం జనావాసాల వైపు అడుగులు వేస్తున్నాయి. అవి సంచరించే ప్రాంతంలో నీటి వనరులు లేనప్పుడే ఈ పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.



సాసర్‌పిట్‌లో వన్యప్రాణి

పగలు కన్నా.. రాత్రుల్లోనే నీటికోసం..

అటవీ ప్రాంతంలో ఉన్న వన్య ప్రాణులు పగటిపూట కన్నా.. రాత్రిపూటే నీటికోసం అటవీ గ్రామాల శివారుల్లోకి వచ్చేస్తున్నాయి. రాత్రి వేళల్లో తోటల్లోకి వచ్చి నీటి కోసం పరుగులు తీయడం కనిపిస్తోందని ప్రత్యక్షంగా చూసిన రైతులు అంటున్నారు. వీటి వల్ల తోటలకు ఎలాంటి హాని ఉండదని, ఏనుగులతో మాత్రం హాని ఉంటుందని చెబుతున్నారు. తెల్లవారుజాము వరకు మైదాన ప్రాంతంలోనే దాహార్తి తీర్చుకొని సేద తీరుతుంటాయి. గుక్కెడు నీటి కోసం నీటి చెలమలను వెతుక్కుంటూ వస్తున్నాయి.

అభయారణ్యాలు : శేషాచలం, లంకమల, పెనుశిల, నల్లమల

జిల్లా	రేంజ్‌లు	విస్తీర్ణం(హెక్టార్లు)
వైఎస్సార్	9	2 లక్షల 94 వేలు
అన్నమయ్య	8	2 లక్షల 74 వేలు

నీటి వనరుల కల్పన దిశగా..

అభయారణ్యంలో వన్యప్రాణుల తాపం తీర్చేందుకు ఇప్పటికే ఉన్న సాసర్‌పిట్‌లకు ట్యాంకర్ల ద్వారా నీటిని నింపనున్నారు. అన్నమయ్య జిల్లాలో 250, వైఎస్సార్ జిల్లాలో 350 వరకు సాసర్‌పిట్స్ అందుబాటులో ఉంటాయని అటవీ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే అటవీ ప్రాంతంలో చెట్లకు ఉప్పుగడ్డలను కడతారు. వన్యప్రాణులు ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు అటవీశాఖ ఈ విధంగా చర్యలు తీసుకోనుంది. బయోసాప్ స్కీం కింద నీటి వనరులకు నిధులను కేటాయించనున్నారు. ఫిబ్రవరి నుంచే అటవీశాఖ నీటి వనరుల కల్పన దిశగా చర్యలు చేపట్టింది.

వన్యప్రాణుల దాహార్తి తీర్చడంపై దృష్టి



వన్యప్రాణుల దాహార్తి తీర్చడంపై దృష్టి సారించనున్నాం. ఫిబ్రవరి నుంచే వేసవి పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి. బయోసాప్ స్కీం కింద సాసర్‌పిట్, నీటి కుంటలలో నీటిని నింపుతాము. వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అన్ని జాగ్రత్తలను తీసుకోనున్నాం. వన్యప్రాణులకు నీటి వనరులు అందుబాటులో ఉండేలా సర్వం సిద్ధం చేశాం.
– ఎస్.వివేక్, జిల్లా అటవీ అధికారి, రాజంపేట

వన్యప్రాణి సంరక్షణకు చర్యలు



వేసవిని దృష్టిలో ఉంచుకొని వన్యప్రాణుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. దాహార్తి తీర్చేందుకు అన్ని రకాలుగా ఏర్పాట్లు చేస్తున్నాం. తమ తమ స్థాయిలో ఆయా ఫారెస్టు రేంజర్‌లు పకడ్బందీగా దాహార్తి తీర్చే విధంగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లనున్నారు.
– పీవీ సందీప్‌రెడ్డి, జిల్లా అటవీ అధికారి, కడప

క్లుప్తంగా

అగ్నికి అరటితోట ఆహుతి

కాశినాయన : బసనపల్లె గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని 3 ఎకరాల్లో అరటిపంట కాలిపోయింది. మూడు ఎకరాల్లోని అరటిపంట, డ్రిప్ వైర్లు పూర్తిగా కాలి పోయాయని బాధిత రైతులు మహానందిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఆదిరెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మైదుకూరు : మండలంలోని కొత్తవిపరాపురం సమీపంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇండ్ల ఆంజనేయులు (32) అనే వ్యక్తి మృతి చెందాడు. బద్వేలు మండలం చెన్నంపల్లె మిట్ట ఎస్సీ కాలనీకి చెందిన ఆంజనేయులు వ్యక్తిగత పని మీద ఖాజీపేటకు వచ్చాడు. అనంతరం బైక్‌లో ఖాజీపేట - కూడలి రహదారిలో బద్వేలుకు బయలురాడు. విపరాపురం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

టిప్పర్, బైక్ ఢీ: వ్యక్తికి తీవ్ర గాయాలు

వల్లూరు: వల్లూరులోని వాహిద్ నగర్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాబా వల్లీ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. యర్రగుంట్లకు చెందిన బాబా వల్లీ ద్విచక్ర వాహనంలో వస్తూ వాహిద్ నగర్ సమీపంలోని ఆవిర్భావ్ వెంచర్‌లోకి వాహనాన్ని తిప్పాడు. కడప నుంచి యర్రగుంట్ల వైపునకు వస్తున్న టిప్పర్ బైక్‌ను ఢీకొంది. ద్విచక్ర వాహనదారుని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో బైక్‌లో ప్రయాణిస్తున్న బాబా వల్లీ తీవ్రంగా గాయపడ్డాడు.

మహిమాన్వితుడు.. జమాలయ్యస్వామి

- నేటి నుంచి కృష్ణంపల్లె తిరునాల
- రెండు రోజుల పాటు జరుగనున్న ఉరుసు
- రాయలసీమ వ్యాప్తంగా రానున్న భక్తులు

జమాలయ్య కృష్ణంపల్లెకు వచ్చింది	1878
నిర్యాణం పొందినది	1883
దువ్వూరు నుంచి కృష్ణంపల్లె దూరం	10 కి.మీ
ప్రొద్దుటూరు నుంచి	21 కి.మీ


జమాలయ్యస్వామి దర్గా


దర్గాలో జమాలయ్యస్వామి మజార్

దువ్వూరు : ఆయన గొప్ప తపస్వి. నాడు కరువు రక్కసి కోరల్లో చిక్కుకొని విలవిల్లాడుతున్న ఈ ప్రాంత ప్రజల కోసం సురగంగను కురిపించిన గొప్పవారు. అందుకే మతాలకతీతంగా ప్రజలకు ఆరాధ్యుడయ్యాడు. ఆయనే దువ్వూరు మండలంలోని కృష్ణంపల్లెలో గ్రామంలో వెలసిన హజరత్ జమాల్‌వలి స్వామి. ఆయనను జమాలయ్య స్వామిగా కూడా పిలుచుకుంటారు. జమాల్‌వలి స్వామి ఉరుసు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 7న గంధము, 8న ఉరుసు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాతో పాటు నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారు. జమాలయ్య స్వామిని దర్శించుకుంటే కష్టాలన్నీ తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. కోర్కెలు, కష్టాలు తీరిన భక్తులు తమ బిడ్డలకు స్వామి పేరు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. తిరునాల సందర్భంగా మంగళవారం ఉదయం బండలాగుడు పోటీలు జరుగుతాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు ప్రథమ బహుమతి రూ. 30,116, రెండో బహుమతి రూ. 20,116, మూడు, నాలుగో బహుమతుల కింద రూ. 10,116, రూ. 5,116లు అందచేే యనున్నట్లు నిర్వాహకులు వెన్నపూస పుల్లారెడ్డి, చిన్న పుల్లారెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి కృష్ణంపల్లె కళాకారులచే సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకాన్ని ఉచితంగా ప్రదర్శిస్తారు. తిరునాల సందర్భంగా రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తిరునాలకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు దువ్వూరు ఎస్‌ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపారు.

జమాలయ్యస్వామి మహిమలు..

చరిత్రలో పెనువిషాదం మిగిల్చిన సంవత్సరం 1876. ఆ ఏడాది వర్షాలు లేక ఈ ప్రాంతంలో భయంకర కరువు వచ్చింది. ఎక్కడా పంటలు పండలేదు. బావులు, చెరువులు, నదులు ఎండిపోయాయి.తాగునీటికి కరువైన పరిస్థితులు నెలకొన్నాయి. తినడానికి తిండిలేక ఆకలిబాధతో, కలరా, మశూచి, జ్వరాలు, పేగు సంబంధిత సమస్యలు, ఇతర కారణాల వల్ల వేలాది మంది మృత్యువాత పడ్డారు. మానవ ప్రయత్నాలన్నీ విఫలమైనప్పుడు దేవుని వైపు చూడటం సహజం. పుష్పగిరితో పాటు పలు ప్రముఖ ఆలయాల్లో ప్రభుత్వమే వరుణ యాగాలు జరిపించింది.

జమాలయ్య స్వామి దీక్షతో కరుణించిన వరుణుడు

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో నంద్యాలకు చెందిన జమాల్‌వలి స్వామి రాజుపాళెం మండంలోని వెలవలి గ్రామానికి వచ్చారు. దువ్వూరు మండలం కృష్ణంపల్లె గ్రామానికి చెందిన నాగిరెడ్డి ఎడ్లబండి కట్టుకొని పని మీద వెలవలికి వెళ్లగా జమాల్‌వలి స్వామి ఆయన వెంట గ్రామానికి వచ్చారు. కరువు కాలంలో ప్రజల దయనీయ స్థితిని చూసి స్వామి చలించిపోయారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఏటి ఒడ్డున కూర్చొని స్వామి వారు కఠోర తపోదీక్ష చేపట్టారు. ఎట్టలకేలకు జమాలయ్య స్వామి తపము ఫలించింది. భారీ వర్షాలతో కుందూ నదిలో వరద ప్రవాహం పోటెత్తింది. చెరువులు, కుంటలు, బావులు పొంగి పొర్లడంతో ప్రజలు ఆనందపరవశులయ్యారు. స్వామి తపోదీక్ష వల్లనే వర్షాలు కురిశాయని ప్రజలు విశ్వసించారు. అప్పటి నుంచి కులమతాలకు అతీతంగా ఆయనను ప్రజలు ఆరాధించసాగారు. 1883లో జమాలయ్యస్వామి తనువు చాలించారు. కృష్ణంపల్లె గ్రామంలోని వెన్నపూస ఎరికలరెడ్డి, నాగిరెడ్డి సోదరులకు చెందిన బావి, మామిడితోట ప్రదేశంలో సయ్యద్ జమాల్‌వలి స్వామి దర్గా నిర్మాణం జరిగింది. నేటికి ఈ వంశీయులే దర్గా ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు. దువ్వూరు మండల పరిధిలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కన కానగూడూరు గ్రామానికి తూర్పున 2 కిలోమీటర్ల దూరంలో దర్గా ఉంది.


తిరునాల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న జైంట్ వీల్, ఇతర వినోద పరికరాలు

హాస్టల్‌లో పేలుడు.. బాలుడికి గాయాలు

ఆలస్యంగా వెలుగులోకి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక పాట్టిపాడు రోడ్డులోని ఎస్సీ హాస్టల్-2లో పేలుడు జరిగి బాలుడికి గాయాలయైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసుల కథనం మేరకు గత నెల 24న రాత్రి 8.30న రాత్రి ముగ్గురు పిల్లలు తెల్లటి వైరు, బ్యాటరీ, ఒక లైటు బయట దొరికాయని హాస్టల్‌లోకి తీసుకెళ్లారు. వాటిని బ్యాటరీకి కనెక్షన్ ఇవ్వడంతో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో మధుపాల్ అనే బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. గాయ పడిన బాలుడిని కడప ఆస్పత్రికి తరలించి శస్త్ర చికిత్స చేశారు. ఈ సంఘటనపై హాస్టల్ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంజీవరెడ్డి తెలిపారు. పేలుడు పదార్థాలను ల్యాబ్‌కు పంపించి అవి దేనికి సంబంధించి అనే దానిపై విచారణ చేస్తామన్నారు. కాగా పిల్లలకు పేలుడుకు కారణమైన వస్తువులు ఎలా వచ్చాయనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. బాలుడు డిశ్చార్చి అయిన తర్వాత పూర్తి విషయాలు బయటపడే అవకాశం ఉంది.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు : అన్నమయ్య జిల్లా వేపూరికోటలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ మల్లిక సోమవారం తెలిపారు. వేపురికోటకు చెందిన అమృత్ కుమార్ రెడ్డి నుంచి 2880 కర్ణాటక మద్యం టెట్రా పాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతన్ని అరెస్టు చేశామన్నారు.

వాహనాల వేలం

కడప వైఎస్సార్ సర్కిల్ : కడప స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం నిర్వహించినట్లు కడప ఎస్‌ఈబీ సీఐ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడపలో వేలంపాట నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఈబీ అధికారి శ్రీనివాస్, ఎస్‌ఐ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం
- పార్టీ శ్రేణులకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపు


మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : జగనన్న ప్రభుత్వం మూడున్నరేళ్లలో చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ మద్దతుతో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి.రామచంద్రారెడ్డిలను గెలిపించుకుందామని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కడప రోడ్డులోని మధురెడ్డి కన్వెన్షన్ హాలులో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై వేంపల్లె, చక్రాయపేట మండలాల్లో ఉన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ సారథులు ప్రతి ఓటరునూ గుర్తించి ప్రభుత్వం చేసిన మేలును తెలియజేయాలన్నారు. పట్టభద్రులు బ్యాలెట్‌లో మూడో సంఖ్యలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బ్యాలెట్‌లో 11వ సంఖ్యలో ఉన్న ఎం.వి.రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా ఓటర్లను అభ్యర్థించారు. బూత్‌స్థాయి సభ్యులు ప్రతి ఓటరూను కలిసి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని ఎంపీ సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకే నోటిఫికేషన్‌తో సచివాలయాల్లో 1,36,000పోస్టులు, ఆరోగ్య శాఖలో 40వేలు, పోలీసు, న్యాయ శాఖల్లోనూ పోస్టులను భర్తీ చేశారన్నారు. ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ నిరాటంకంగా సంక్షేమం కొనసాగించిన విషయాన్ని వివరించాలని తెలిపారు. టీడీపీ, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని చెప్పారు. రైతులు కరువుతో అల్లాడిపోతున్న సమయంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. ప్రస్తుతం ఆయన తనయుడు సీఎం వైఎస్ జగనన్న కూడా పులివెందుల తర్వాత వేంపల్లె అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్ కృషి

మహానేత ఎస్సార్ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పులివెందుల ఎన్నికల పరిశీలకుడు పోలా శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు రవికుమార్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ గురుమోహన్, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, డైరెక్టర్లు బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, షబ్బీర్‌వల్లి, సల్మా, మునీర్, ఎంపీపీలు లక్ష్మీ గాయత్రి, మాధవీ బాలకృష్ణ, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జీఐఎస్ సదస్సు విజయవంతం శుభపరిణామం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : వైజాగ్‌లో ఈ నెల 3, 4వ తేదీల్లో జరిగిన జీఐఎస్ సదస్సు విజయవంతం కావడం హర్షణీయమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచం అంతా తెలిసిన అంబానీ, అదాని లాంటి పారిశ్రామిక దిగ్గజాలు స్వయంగా సమ్మిట్‌కు హాజరై పెట్టుబడులు పెడతామని చెప్పడం శుభపరిణామం అన్నారు. రాష్ట్రానికి రూ.13లక్షల కోట్లు పెట్టుబడులు రావడం చరిత్రలో ఎన్నడూ లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనితీరు, వ్యవహార శైలిని బట్టీ పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రానికి రావడంతో పాటు లక్షల కోట్లు పెట్టుబడులు పెడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు చేపట్టిన సమ్మిట్‌లో కాశ్మీర్ స్వెట్టర్స్ అమ్మేవారికి సూటు బూటు ధరించి పారిశ్రామికవేత్తలుగా ప్రజలకు పరిచయం చేశారని ఎద్దేవా చేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో జరిగిన సమ్మిట్ కూడా నామమాత్రమే అని అన్నారు. ఏపీకి కాబోయే ఎగ్జిక్యూటివ్ రాజధాని వైజాగ్ అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, హిదాయత్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటిపైకప్పు: తప్పిన ప్రమాదం

సింహాద్రిపురం : మండలంలోని బి.చెర్లోపల్లె గ్రామంలో సోమవారం ఇంటి పైకప్పు కూలిపోయింది. వివరాలు..బి.చెర్లోపల్లె గ్రామంలో రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, రాజ్యలక్ష్మి దంపతులు, ఇద్దరు పిల్లలు మిద్దెపై ఉండగా మట్టి రాలింది. దీంతో వారు కిందకు దిగి బయటకు వచ్చారు. కొద్దిసేపటికి ఇంటి పైకప్పు కూలిపోయింది.ఇంట్లోని వస్తువులు ధ్వంసమయ్యాయి. రూ.5లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.చెరువు కు సమీపంలో ఇళ్లు ఉండటంతో పునాదుల్లోకి నీరు వచ్చి ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.


కూలిపోయిన ఇంటి పైకప్పు

రథోత్సవం.. రమణీయం

- అంగరంగ వైభవంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి తేరు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు


వైభవంగా సాగిన స్వామివారి రథోత్సవం

గుర్రంకొండ : అన్నమయ్య జిల్లా తరిగొండ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజైన సోమవారం స్వామివారిని స్థానిక బస్టాండు కూడలిలోని తేరు(రథం) వద్దకు తీసుకొచ్చి అందులో కొలువుదీర్చారు. ఆలయంలో ధూళి ఉత్సవం నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో రథాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు గ్రామానికి చేరుకొని గోవిందా, గోవిందా అంటూ భక్తి తన్మయత్వంతో స్వామివారి రథాన్ని లాగారు. రథోత్సవాన్ని పురస్కరించుని పలు కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు అన్నదానం నిర్వహించారు. మేళతాళాలు, కోలాటాలు, టీటీడీ కళాకారుల సాంస్కృతి కార్యాక్రమాలతో రథోత్సవం గ్రామపురవీధుల గుండా వైభవంగా సాగింది. శనివారం రాత్రి స్వామివారి తిరునాల ఘనంగా జరిగింది. తరిగొండతోపాటు పరిసర గ్రామాల ప్రజలు చాందినీ బండ్లు, అన్నం,టెంకాయ బండ్లు ఆలయం చుట్టూ తిప్పారు. చాందినీ బండ్లు అందరినీ ఆకట్టుకొన్నాయి. కలకడ సిఐ నాగేంద్ర, గుర్రంకొండ ఎస్ దిలీప్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీస్‌బందోబస్తు నిర్వహించారు.

స్వామివారి సేవలో ఎమ్మెల్యే చింతల

తరిగొండ శ్రీలక్ష్మీన రసింహస్వామి రథోత్సవ కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. సోమవారం ఆయన గ్రామానికి చేరుకున్నారు. అర్చకులు, టీటీడీఅధికారులు ఆలయమర్యాదలతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా రథోత్సవంలో కొలువైన స్వామివార్లకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి కొద్దిసేపు రథాన్ని లాగారు. అనంతరం అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వామివారి అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి సంఘం గౌరవాధ్యక్షుడు వరదారెడ్డి నారదరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చింతల శివానందరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, మార్కెట్‌కమిటి డైరెక్టర్ సురేష్, మాజీసర్పంచ్ కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జిల నియామకం

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు జోనల్ ఇన్‌చార్జిలను నియమించారు. ఈమేరకు సోమవారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వివరాలు అందాయి.

నెల్లూరు, వైఎస్ఆర్, తిరుపతి జిల్లాల జోనల్ ఇన్‌చార్జిలు	
విభాగం	జోనల్ ఇన్‌చార్జి
యూత్	చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చంద్రగిరి
రైతు	మావులూరి శ్రీనివాసులు రెడ్డి, కోవూరు
బీసీ సెల్	తొండమల్ల పుల్లయ్య, తిరుపతి
వైఎస్సార్ టీయూసీ	నారపరెడ్డి రాజా రెడ్డి, తిరుపతి
పంచాయతీరాజ్	చీర్ల సురేష్ యాదవ్, కమలాపురం
ఎస్టీ సెల్	చేవూరు పద్మ, కావలి
మైనారిటీ సెల్	సయ్యద్ హంజా హుసేనీ, నెల్లూరు
విద్యార్థి	లెక్కల రాజశేఖర్ రెడ్డి, తిరుపతి
వికలాంగుల	కొమ్మిరెడ్డి శివా రెడ్డి, వినుకొండ
వైఎస్ఆర్ సేవాదళ్	షేక్ మహ్మద్ రఫీ, తిరుపతి
డాక్టర్స్	డా.అమీర్ బాషా, కడప
వాణిజ్య	చందోలు సతీష్, నెల్లూరు సిటీ
కల్చరల్	ఎస్.కృష్ణవేణి, తిరుపతి
పబ్లిసిటీ	డి.బీరేంద్ర వర్మ, సత్యవేడు
మహిళా	రత్న కుమారి, కడప
గ్రీవెన్స్ సెల్	పోకల రామకృష్ణారెడ్డి, బద్వేల్
వీవర్స్	మిద్దెల హరి, తిరుపతి

త్రుటిలో తప్పిన ప్రమాదం

- విద్యుత్ జంక్షన్ బాక్స్ నుంచి మంటలు
- సకాలంలో స్పందించి మంటలు ఆర్పివేత


విద్యుత్ జంక్షన్ బాక్స్ నుంచి వస్తున్న మంటలు

కడప అర్బన్: కడపలోని కోటిరెడ్డి సర్కిల్ సమీపంలో ఉన్న డీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని విద్యుత్ జంక్షన్ బాక్స్‌లో సోమవారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో మంటలు వచ్చాయి. అదే సమయంలో అటువైపు వెళుతున్న కడప వన్‌టౌన్ ఎస్‌ఐ మధుసూధన్‌రెడ్డి, గమనించారు. సంఘటన స్థలంలో మంటలతో పాటు పై అంతస్తులకు పొగలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అగ్నిమాపక శాఖ వారు వచ్చి, ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయించారు. పూర్తి స్థాయిలో మంటలను ఆర్పివేశారు. ఆ భవనంలోని ఉద్యోగులను, ఇతర సిబ్బందిని సురక్షితంగా బయటకు పంపించారు. విద్యుత్ జంక్షన్ బాక్స్ వరకు రూ. 50 వేలు నష్టం వాటిల్లి ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు. సకాలంలో స్పందించి మంటలను ఆర్పివేసిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి ఉద్యోగులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.